క్లుప్తంగా

జవాన్‌కు ఘన స్వాగతం



మడికొండ: మడికొండ గ్రామానికి చెందిన గుగులోతు రంజిత్‌కుమార్ నాయక్.. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో రాజస్థాన్ రాష్ట్రం జోద్‌పూర్‌లో ఎయిర్ బేస్ నుంచి ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నారు. ఈమేరకు స్వగ్రామానికి ఆదివారం రాగా, అతడికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి, గుర్రం అమర్‌నాథ్, మెట్టుగుట్ట రామాలయం చైర్మన్ పల్లపు అర్జున్, బైరి లింగమూర్తి గౌడ్, వస్కుల శంకర్, సాంబయ్య, బాలజీ, చంటి, విజయ్, కిషన్, శ్రీను, మహేందర్, కుమార్, వెంకన్న, నాగేశ్వర్‌రావు, స్థానికులు పాల్గొన్నారు.

నగరంలో సైకిల్ ర్యాలీ



హన్మకొండ అర్బన్: ఫిట్‌నెస్ ప్రోత్సాహంలో భాగంగా మై భారత్, ఏజీ ఫెడరల్స్, ట్రైసిటీ రైడర్స్ సంయుక్తంగా సైకిల్ డైను పురస్కరించుకుని నగరంలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ర్యాలీ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిఒక్కరూ వారంలో ఒక్కరోజైనా సైకిల్ ఉపయోగించాలని సూచించారు. హంటర్ రోడ్డులో ప్రారంభమైన ర్యాలీ.. నగరం చుట్టూ సాగింది. కార్యక్రమంలో చింతల అన్వేష్, జయంత్, అవినాష్, నిఖిల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్‌గార్డెన్‌లో రక్తదాన శిబిరం



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ ఆవరణలో ఆదివారం ఉదయం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పబ్లిక్‌గార్డెన్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా, తలసేమియా వ్యాధి బాధితుల కోసం ఏర్పాటు చేసిన శిబిరంలో 50మంది వాకర్లు పాల్గొని రక్తదానం చేశారు. వారి నుంచి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటనారాయణ, గార్డెన్ వాకర్స్ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ తరగతులు



విద్యారణ్యపురి: సైకిల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా గురువు జంగా గోపాల్ రెడ్డి, రామక శ్రీనివాస్ ఆధ్వర్యంలో హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 5గంటల నుంచి 6.30 గంటల వరకు, సమాజ ఆరోగ్య నిర్మాణం కోసం యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు వారు ఆదివారం తెలిపారు. ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా 5నుంచి ప్రత్యేక యోగా తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

వ్యక్తి అదృశ్యం



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం కొత్తపల్లికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈమేరకు బాధితుడి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొత్తపల్లికి చెందిన కొత్తూరు యుగంధర్ గతనెల 29వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవంతో వివిధ ప్రాంతాల్లో గాలించారు. అయినా, అతడి ఆచూకీ కానరాకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

ఆర్యవైశ్య వాసవిమాత పరపతి సంఘం అధ్యక్షుడిగా రమేష్

రామన్నపేట: వరంగల్ ఆర్యవైశ్య వాసవిమాత పరపతి సంఘం అధ్యక్షుడిగా ఇరుకుళ్ల రమేష్ ఎన్నికయ్యారు. వాసవిమాత జన్మస్థలమైన పెనుగొండలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నియమకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబాలను కూలుస్తోంది

విస్తరిస్తున్న పేకాట విషసంస్కృతి

- జూదానికి కేంద్రాలుగా గృహాలు, నిర్జన ప్రదేశాలు
- ఫుల్లుగా మందు, విందుతో పేకాట
- నట్టా స్థావరాల్లో రూ.లక్షల్లో లావాదేవీలు
- టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పట్టుబడుతున్న నిందితులు



స్వాధీనం చేసుకున్న నగదు, ప్లేకార్డులను చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు (ఫైల్)



నగదు, ప్లే కార్డులు చూపుతున్న మిల్స్ కాలనీ పోలీసులు (ఫైల్)

ఖిలా వరంగల్:

- ఇటీవల వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోటలోని ఓ ఇంట్లో కొంతకాలంగా పేకాట ఆడుతున్నారు. పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి అధికారులు ఆ ఇంటిపై దాడి చేశారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.20,820 నగదు, 3బైకులు, 4మొబైల్ ఫోన్లు, ప్లేకార్డులు స్వాధీనం చేసుకున్నారు.
- గత 5న వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి శివనగర్‌లోని కొనిదెల వేణుగోపాల్ ఇంటి ఆవరణలో పది మంది పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి పదిమంది పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసి, వారి నుంచి రూ.1,01,330 నగదు, 10 మొబైల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.
- ఇటీవల మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి లేబర్ కాలనీ ప్రతాప్‌నగర్‌లో రహస్యంగా సట్టా ఆడుతున్నారని పక్కా సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి సట్టా నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి, అతడి నుంచి రూ.5,300ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఇలా వెలుగులోకి వచ్చిన కొన్ని సంఘటనలే.. వెలుగు చూడనవి ఇంకా చాలా ఉన్నాయి. వరంగల్ నగరంలో ఇటీవల పేకాట జోరందుకుంది. ఎవరికీ అనుమానం రాకుండా నివాస గృహాలను అడ్డాలుగా మార్చుకున్నారు. నగరంతోపాటు పల్లెలకు కూడా ఈ విషసంస్కృతి పాకింది. పేకాట నిర్వాహకులు పెద్ద మనుషులుగా చెలామణి అవుతుండడం, వారికి అండగా కొందరు రాజకీయ నేతలు ఉండడంతో ఈ విషసంస్కృతి రోజు రోజుకూ విస్తరిస్తోంది.



నగరంలో ఐదేళ్ల క్రితం వరకు పేకాటకు ప్రత్యేక క్లబ్‌లు ఉండేవి. వాటివల్ల జరుగుతున్న నష్టాన్ని భరించలేని పలువురు మహిళలు.. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో క్లబ్‌లు మూతపడ్డాయి. ఈక్రమంలో పేకాటను పూర్తిగా వదులుకోలేని కొందరు నిర్వాహకులు నివాసాలనే అడ్డాలుగా మార్చుకున్నారు. వరంగల్ ట్రైసిటీతో పాటు మిల్స్‌కాలనీ, మామునూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎక్కువ పేకాట స్థావరాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నివాస గృహాలు, నిర్జన ప్రదేశాలే అడ్డాలు

కుటుంబాల్లో చిచ్చుపెట్టి ఆర్థికంగా దివాలా తీయించే మహమ్మారి పేకాట.. మిల్స్‌కాలనీ, మామునూరు పోలీసు స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో జోరుగా సాగుతోంది. చట్టరీత్యా నేరమైన పేకాట పెద్దఎత్తున గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా చారిత్రక ప్రదేశాలు, ఖాళీ స్థలాలు, మామిడి తోటలు, చెట్లు, పొదలు, వెంచర్లలోని గెస్ట్ హౌసులు, నివాస గృహాల్లో దర్జాగా ఆడుతున్నట్లు వినికిడి. ఇళ్లలో అయితే మందు, విందును ఆస్వాదిస్తూ గుట్టుచప్పుడు కాకుండా జోరుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం. ప్రతిరోజు నగరంలోని వ్యాపారవేత్తలు, నాయకులు సాయంత్రం నుంచే అక్కడ పాగా వేసి అర్ధరాత్రి వరకు పేకాడి, తెల్లవారుజామున తిరిగి తమ ఇళ్లల్లోకి వెళ్తున్నట్లు తెలుస్తోంది.

కరిగిపోతున్న స్థిర, చరాస్తులు

ఇలా కొన్ని నెలలు గడిచిన తర్వాత పేకాట రాయుళ్ల చేతిలో డబ్బు, తాత ముత్తాతలు, అమ్మానాన్నలు కష్టపడి సంపాదించిన స్థిర, చరాస్తులన్నీ కరిగిపోతున్నాయి. చివరకు ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ అవమానాలను తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. స్థానిక పోలీసుల కనుసన్నల్లోనే ఈ వ్యాపారం సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక పోలీసులకు పేకాట నిర్వాహకుల నుంచి ప్రతీనెలా మామూళ్లు ముడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతస్థాయి అధికారులు స్పందించి పేకాట జబ్బు నుంచి తమ భర్తలను విముక్తి చేయాలని బాధిత పేకాట రాయుళ్ల భార్యలు వేడుకుంటున్నారు.

యథేచ్ఛగా రాత్రంతా పేకాట

ఎంచుకున్న స్థావరాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా యథేచ్ఛగా పేకాట ఆడుతున్నారు. పేకాటలో నిందితులు లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటుండగా, నిర్వాహకులకు మాత్రం కాసుల పంట పండుతోంది. ప్రశాంతంగా ఉండే తోటల్లో పేకాట రాయుళ్లు హాయిగా మద్యం సేవిస్తూ పేకాట ఆడుకుంటున్నారు. వారికి కావాల్సిన మద్యం, మాంసాహారం పేక ముక్కలను సైతం నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. అలాగే, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బెల్ట్‌షాపుల్లో మద్యంతోపాటు పేకాట కూడా నడుస్తోంది. ముఖ్యంగా ఖిలా వరంగల్ పరిసరాలు, కరీమాబాద్, శివనగర్, చింతల్, శాంతినగర్, దూపకుంట రోడ్డు, రంగశాయిపేట, ఎస్ఆర్ఆర్ తోట, మామునూరు, బొల్లికుంట, రాంగోపాలపురం, నక్కలపెల్లి, లక్ష్మీపురం, తిమ్మాపురం, జక్కలొద్ది గ్రామాల్లోని నిర్జన ప్రదేశాలు, బెల్ట్‌షాపుల్లో ఈ దందా కొనసాగుతున్నట్లు సమాచారం.

ఎట్టకేలకు న్యూశాయంపేటలో ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్



ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్

కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేట జంక్షన్‌లో ఎట్టకేలకు ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్‌ను అధికారులు ఆదివారం ఏర్పాటు చేశారు. న్యూశాయంపేట చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ లేక రోడ్డు ప్రమాదాలకు జరుగుతున్నాయని సాక్షి దినపత్రికలో అనేక కథనాలు వచ్చాయి. ఈక్రమంలో కథనాలకు స్పందించిన అధికారులు.. ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఇక వాహనాల స్పీడ్‌కు బ్రేక్ పడుతుందని, ప్రమాదాల నివారణకు సిగ్నల్ పాయింట్ దోహదపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

సివిల్ ర్యాంకర్‌కు సన్మానం



సాయి శివానిని అభినందిస్తున్న సభ్యులు

ఖిలా వరంగల్: ఇటీవల ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఫలితాల్లో 11వ ర్యాంకు సాధించిన శివనగర్‌కు చెందిన ఇట్టబోయిన సాయి శివానిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మంచాల కృష్ణమూర్తి, సంఘం సభ్యులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయి శివానికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఓరుగంటి విమల, త్రివేణి, రాధిక, శ్రీమన్నారాయణ, కూరగాయల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను సీఎంను చేసేందుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్ భాస్కర్

హన్మకొండ: కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులమంతా పునరంకితం కావాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, 420 హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. హామీలు అమలుచేయక మోసం చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వకుండా మోసం చేస్తోందని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు 14 ఏళ్ల పోరాటం చేసి, రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్.. 10 ఏళ్ల సీఎంగా ఉండి దేశంలోనే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏడాదిన్నరలోనే విఫలమైందని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నాగూర్ల వెంకటేశర్లు, మర్రి యాదవరెడ్డి, నల్ల స్వరూపరాణి, ఇమ్మడి లోహిత, సంకు నర్సింగ్, సోదా కిరణ్, బొంగు అశోక్ యాదవ్, పులి రజనీకాంత్, జోరిక రమేష్, బొల్లికొండ వీరేందర్, ఇమ్మడి రాజు పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



సన్నాహక సమావేశంలో పూర్వ విద్యార్థులు

హసన్‌పర్తి: ఈనెల చివరి వారంలో నిర్వహించనున్న 1989 – 90 ఎస్సెస్సీ బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పూర్వ విద్యార్థులు పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమావేశం విజయవంతానికి వివిధ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు వెంకటస్వామి, యాదగిరి, ఉప్పుల సంపత్, రాజ్‌కుమార్, నాగేందర్, రమేష్, సదానందం, రాముడు, భాస్కర్, అమరేందర్, సర్వోత్తంరెడ్డి, రామారావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



మధ్యకోటలో కవాతులో ఏసీపీ, పోలీసులు

ఖిలా వరంగల్ / రామన్నపేట: శాంతి భద్రల పరిరక్షణే తమ ధ్యేయమని ఏసీపీ నందిరామ్ నాయక్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు ఖిలా వరంగల్ రహదారులపై సబ్ డివిజన్ పోలీస్ బలగాలు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం తామున్నామంటూ భరోసా ఇచ్చారు. ముఖ్యఅతిథిగా ఏసీపీ నందిరామ్ నాయక్ హాజరై జెండా ఊపి కవాతును ప్రారంభించారు. మట్టెవాడ ఏసీపీ కార్యాలయం నుంచి పోచమ్మమైదాన్, వెంకట్రామా టాకీస్, తెలంగాణ జంక్షన్, చింతల్ బ్రిడ్జి మీదుగా మధ్య కోట శిల్పాల ప్రాంగణం వరకు కవాతు సాగింది. కవాతులో ఇన్‌స్పెక్టర్లు తుమ్మ గోపిరెడ్డి, షుకూర్, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ఎస్సైలు, పోలీసు బలగాలు పాల్గొన్నారు.

'గురుకులాల కార్యదర్శిని సస్పెండ్ చేయాలి'

హన్మకొండ: దళిత విద్యార్థులు వారి బాత్‌రూమ్‌లు, రూమ్‌లను వారే శుభ్రం చేసుకోవాలని అవమానపర్చి, అగ్రకుల స్వభావాన్ని చాటిన గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిని తక్షణమే సస్పెండ్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ప్రిన్సిపాళ్ల సమావేశంలో విద్యార్థులను కులం పేరుతో బానిసల కంటే హీనంగా ఆమె అవమానించడం శోచనీయమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, గురుకులాల్లో బోధన లోపభూయిష్టంగా ఉందని, ఆహారంలో నాణ్యత కరువైందని తెలిపారు. విద్యార్థులు లేరనే సాకుతో 12 గురుకుల కళాశాలలను మూసివేయాలనుకోవడం తగదని పేర్కొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



ప్రచార జాతాను ప్రారంభిస్తున్న బాధ్యులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్ రెడ్డి కోరారు. హనుమకొండలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట ప్రచార జాతాను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నారని, నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. ఈక్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫాం, మధ్యాహ్న భోజనం, రాగిజావా అందిస్తున్నట్లు చెప్పారు. టీఎస్‌యూటీఎఫ్ నిర్వహిస్తున్న బడిబాట జాతాకు విశేష స్పందన వస్తోందని టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులను అభినందించారు. ప్రచార జాతాలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీరా రాజారాం, జిల్లా కార్యదర్శి లింగారావు, బాధ్యులు చంద్రయ్య, భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ధనమైసమ్మ శోభాయాత్ర



ధనమైసమ్మ శోభాయాత్రలో భక్తులు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని మెట్ల బావి ధనమైసమ్మ దేవాలయంలో అభివృద్ధి కమిటీ, స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి ఆధ్వర్యంలో ధనమైసమ్మ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ధనమైసమ్మకు ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, వాణి దంపతులు హాజరై అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం శివనగర్ పురవీధులో నిర్వహించిన ధనమైసమ్మ శోభాయాత్రలో అమ్మవారి రథాన్ని భక్తులు లాగారు. మహిళలు ఎదురేగి నీళ్ల ఆరబోసి మంగళ హారతులు పట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కరాటే ప్రభాకర్, ఉమ, బిల్లా రాజు, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ అర్చక వర్గానికి మద్దతిస్తా



మంద కృష్ణమాదిగను సన్మానిస్తున్న ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్: బ్రాహ్మణ అర్చక వర్గాలకు మద్దుతుగా నిలుస్తానని, అర్చక సంఘంలో 21కులాల అర్చకులు ఉండడం, అర్చకత్వ విధులు నిర్వహిస్తుండడం గొప్ప విశేషమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. పద్మశ్రీ అవార్డు పొంది న్యూఢిల్లీ నుంచి శనివారం రాత్రి వరంగల్ నగరానికి చేరుకున్న మంద కృష్ణ మాదిగకు వివిధ కులసంఘాల నాయకులు ఘనంగా స్వాగతం పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. రాత్రి 10గంటలకు హనుమకొండ వేయిస్తంభాల దేవాలయం ఎదుట మంద కృష్ణ మాదిగకు తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, రాష్ట్ర అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్, తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్తంగా

అందాల పోటీలతో ఏం ప్రయోజనం?

న్యూశాయంపేట: ప్రపంచ సుందరీమణుల అందాల పోటీలతో రాష్ట్రానికి ఏమి ప్రయోజనం చేకూరిందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులతో కొట్టుమిట్టాడుతుండగా, అందాల పోటీలు కోసం కోట్లాది రూపాయల నిధులు కేటాయించి అట్టహాసంగా నిర్వహించడం ఏంటని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మడికొండ: 46వ డివిజన్ రాంపూర్ గ్రామానికి చెందిన దేశినేని హనుమంతరావు (70) శనివారం మృతిచెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజ్, రాష్ట్ర ఆయిల్, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు బాధితులను పరామర్శించారు.

వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుపై హర్షం

కాజీపేట రూరల్: కేంద్రప్రభుత్వ ఉద్యోగులు, రైల్వే మెయిల్ సర్వీస్, పోస్టల్, బీఎస్ఎన్ఎల్, ప్రసార భారతి, ఇన్‌కం టాక్స్, తదితర విభాగాల పెన్షనర్ల కోసం హనుమకొండలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలనే నిర్ణయంపై కాజీపేట రైల్వే మెయిల్ సర్వీస్ రిటైర్డ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి పొదుపు.. రేపటికి మదుపు

- ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజనతో అన్నదాతకు భరోసా

కాజీపేట: అన్నదాతలకు వృద్ధాప్యంలో ఆర్థిక ఆసరా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజనను అమలు చేస్తోంది. 60 సంవత్సరాలు పైబడిన సన్న, చిన్నకారు రైతులకు ప్రతీనెలా రూ.3 వేల చొప్పున జీవిత కాలం పింఛన్ అందించనుంది. 18 – 40 ఏళ్ల వయస్సున్న వారు ఈ పథకానికి అర్హులు. ఐదెకరాల సొంత వ్యవసాయ భూమి కలిగిన సన్న, చిన్నకారు అన్నదాతలు, పీఎం కిసాన్ లబ్ధిదారులు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. అయితే, పన్ను చెల్లింపుదారులు, ఉన్నత ఆర్థికస్థితి కలిగి, సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉన్న వారికి ఈ పథకం వర్తించదు.

ప్రీమియం ఇలా కట్టాలి

18 నుంచి 40 ఏళ్ల వయస్సున్న రైతులు ప్రతినెలా రూ.55 నుంచి రూ.200 వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వయస్సున్న రైతు నెలకు రూ.55 చెల్లిస్తే కేంద్రం తన వాటాగా మరో రూ.55 కలిపి మొత్తం రూ.110 జమ చేస్తుంది. 21 ఏళ్ల వయసున్న రైతులు రూ.61, 25 ఏళ్ల వారు రూ.80, 30 ఏళ్ల వారు రూ.105, 35 ఏళ్లకు రూ.150, 40 ఏళ్ల వారు రూ.200 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 60 ఏళ్ల తర్వాత ప్రీమియం చెల్లిస్తున్న రైతులకు ప్రతినెలా రూ.3వేల పింఛన్ లభిస్తుంది. సదరు రైతు మరణిస్తే నామినీగా ఉన్న వారికి నెలనెలా రూ.1,500 పింఛన్ జీవిత కాలం అందుతుంది.

దరఖాస్తు ఇలా చేసుకోవాలి

పీఎం కిసాన్ లబ్ధిదారులు సీఎస్‌సీ కేంద్రానికి వెళ్లి పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేయించాలి. మొదట తమ ఆధార్ నంబరు, తర్వాత నామినీ వివరాలు నమోదు చేయాలి. మాన్‌ధన్ దరఖాస్తు డౌన్లోడ్ చేసుకుని రైతు సంతకం చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. అప్పుడు పీఎం కిసాన్ మాన్‌ధన్ పింఛన్ కార్డు వస్తుంది. పీఎం కిసాన్ పథకానికి నమోదైన బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం నగదు చెల్లించాలి. పీఎం కిసాన్ లబ్ధిదారులు కానట్లయితే సీఎస్‌సీలో దరఖాస్తు చేసుకుని పింఛన్ కార్డును డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



కాజీపేట టీమ్‌కు చెక్కు, కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని

కేయూ క్యాంపస్: పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తనయుడు నాయిని విశాల్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మైదానంలో 14 రోజులుగా నిర్వహించిన నాయిని టీ -10 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ప్రథమ విజేతగా కాజీపేట సురేష్ టీమ్ నిలువగా, ద్వితీయ విజేతగా అలంకార్ ఫిరోజ్ టీమ్ నిలిచింది. ఈమేరకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి హాజరై విజేతలకు కప్, నగదు బహుమతులు అందజేశారు. కాజీపేట టీమ్‌కు రూ.లక్ష విలువగల చెక్కు, అలంకార్ టీమ్‌కు రూ.50 వేల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో 176 టీమ్‌లు పాల్గొన్నాయని అన్నారు. టోర్నమెంట్‌లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయిని రాజేందర్‌రెడ్డి కుమార్తె డాక్టర్ గోదారెడ్డి, అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.